# అతీతజ్ఞానం

సుమారు మూడు వేల ఏళ్ళ క్రితం విదేహాలో జనకుడు అనే రాజు పాలించాడు. ముప్పైవేల ఏళ్ళ క్రితం - అంటే నియాండర్తల్ యుగంలో - ఈయన పెంపుడు కూతురు సీత పరిపూర్ణ మానవుడైన రామచంద్రుల వారిని పెళ్ళాడి అష్టకష్టాలూ పడిన సంగతి పాఠక మహాశయులకు జ్ఞాపకం చెయ్యనవసరంలేదు.

పాఠక మహాశయులకు చాలామందికి తెలియని విషయం ఏమంటే, ఈ జనకుడి వద్ద లక్షలకొద్దీ గోవులూ, టన్నులకొద్దీ బంగారమూ ఉండేది. వేలాది బ్రాహ్మణ్యం "అలో లక్ష్మణా!" అని - రాముడుంటే లక్ష్మణుడుండటానికేం భాగ్యం? - తిండికి మాడి చస్తుంటే ఈ రాజుకు ఇన్ని గోవులూ, ఇంత బంగారమూ ఎలా వచ్చిందని, నోరున్న ప్రతివాడూ అడగటం సహజం. ఈ ప్రశ్న దశదిశల్లో మారుమోగటం జనకుడికి ఎందుకో ఇష్టంలేదు. అదీగాక, జనకుడికి ఇన్ని గోవులూ, ఇంత హిరణ్యమూ కలవాడని శాశ్వత కీర్తి తెచ్చుకోవటం ఇష్టంలేదు. అలాటి కీర్తి ఆ గోవులతోనూ, హిరణ్యంతోనూ పోతుంది. మహాజ్ఞాని అని యుగయుగాల పేరుపడాలని ఆయన తాపత్రయం. అయితే అటువంటి కీర్తికి కూడా భౌతికమైన సాధనాలుండాలనీ, తనకున్న భౌతిక సాధనాలు గోవులూ, బంగారమూ మాత్రమేననీ జనకుడు గుర్తించాడు. గుర్తించి -

జనకుడు ఒక యాగం చేసి, కురు పాంచాల దేశాలలో ఉండే బ్రాహ్మణులనందరినీ ఆహ్వానించాడు. అందరికీ పుష్కలంగా దక్షిణ లిచ్చి, వాళ్ళమీద ఒక తస్సావేశాడు. ఆయన వెయ్యి గోవులను ఒక కొట్టంలో ఉంచి, ఒక్కొక్క గోవు ఒక్కొక్క కొమ్ముకు పదేసి తులాల బంగారం కట్టి, "బ్రాహ్మణోత్తములారా, మీలో బ్రహ్మనిష్ఠులైన వారు ఈ ఆవులను తోలుకుపోండి" అన్నాడు.

వచ్చిన వాళ్ళలో ఒక్కరికీ బ్రహ్మనిష్ఠ అంటే ఏమిటో తెలీదు సరిగదా, అంత బంగారంతో అన్ని గోవులను తోలుకుపోయే ధైర్యం లేదు. అయితే వాళ్ళుమటుకు, "ఈ జనకుడు ఎంత జ్ఞాని! తనకున్న గోధనమూ, ధనమూ అంటే ఎంత నిర్లక్ష్యం!" అని ఆశ్చర్యపడ్డారు.

జనకుడు చేసిన యాగానికి వచ్చిన బ్రాహ్మలలో యాజ్ఞవల్క్యుడు అనే ఆయన ఉన్నాడు. (కాలక్రమాన ఈయన ప్రసిద్ధ స్మృతికర్త కావటమే కాకుండా, శాస్త్ర నియమాలను

గురించి చాలా తేలిగ్గా మాట్లాడాడు. ఉదాహరణకు, శాస్త్రాలు గోమాంస భక్షణమీద నిషేధం పెట్టినప్పుడు ఈ యాజ్ఞవల్క్యుడు "గోమాంసం నిషిద్ధమన్నారు, బాగానే ఉంది. కాని లేగదూడ మాంసం దొరికితే నేను తినకుండా ఉండను!" అని తెగేసి చెప్పేశాడు. ఆయనకు అంత ఘనత ఎలా వచ్చినదీ ప్రస్తుత కథ తెలియజేస్తుంది.)

యాజ్ఞవల్క్యుడు జనకుడి మాట వింటూనే తన వెంట వచ్చిన బ్రహ్మచారి శిష్యుడితో, "ఒరే, ఈ వెయ్యి గోవులనూ మనింటికి తోలుకుపో!" అన్నాడు. శిష్యుడు వెయ్యి గోవులనూ ఇరవై వేల తులాల బంగారంతో సహా తోలుకుపోయాడు.

తాము చెయ్యసాహసించలేని పని యాజ్ఞవల్క్యుడు చేసినందుకు తక్కిన బ్రాహ్మణ్యానికి కోపం వచ్చి, "నువు బ్రహ్మనిష్ఠుడివా?" అని అడిగారు.

యాజ్ఞవల్క్యుడు జనకుడికేసి నమస్కారం చేసి, "నేను బ్రహ్మనిష్ఠుడికి నమస్కారం చేస్తాను. ఇక మన మాటకొస్తే మనందరమూ గోవులు కావలసిన వాళ్ళమే!" అన్నాడు.

తాను బ్రహ్మనిష్ఠుణ్ణి కానని యాజ్ఞవల్క్యుడు ఇలా కుండ పగలేసి చెప్పిన మీదట, అతను ఏ అర్హతతో గోవులను కాజేశాడో తేల్చవలసిన అవసరం కలిగింది. జనకుడివద్ద అశ్వలుడూ, ఆర్తభాగుడూ, ఉషస్తుడూ, కణాళుడూ, ఉద్దాలకుడూ, గార్గి అనే బ్రాహ్మణులున్నారు. వారంతా యాజ్ఞవల్క్యుణ్ణి అనేక చొప్పదంటు ప్రశ్నలు వేశారు. వాటి కన్నిటికీ యాజ్ఞవల్క్యుడు సర్రియలిస్టు సమాధానాలు చెప్పాడు. గార్గి అనేవాణ్ణి "ఇంక ప్రశ్నలడిగావంటే తల పగిలిపోతుంది!" అని కూడా భయపెట్టాడు.

అయితే యాజ్ఞవల్క్యుణ్ణి తిప్పలు పెట్టినవాడు, ఆర్తభాగుడనే ఋత్విక్కు. "గ్రహాలెన్ని? అతి గ్రహాలెన్ని? అవి ఏవి?ఎలాటివి? నశించేవన్నీ మృత్యువుకు ఆహారం గదా? మృత్యువు దేనికి ఆహారం? బ్రహ్మవేత్త చచ్చిపోతే చావకుండా మిగిలేది ఏది?" లాటి ఊహకు అందని ప్రశ్నలు వేసి యాజ్ఞవల్క్యుడికన్న పెద్ద సర్రియలిస్టుగా తయారయాడు.

వాడితో రాజీపడటం మంచిదనిపించింది యాజ్ఞవల్క్యుడికి.

"ఇక్కడ మరీ సందడిగా ఉంది. మనం ఇంకెక్కడికైనా పోయి ఏకాంతంగా మాట్లాడుకుందాం!" అన్నాడతను. ఇద్దరూ కొన్ని సమస్యలకు సమాధానాలు కూడబలుక్కుని, మిగిలిన బ్రాహ్మణ సందోహం సమక్షానికి వచ్చి ఆ సమాధానాలు ప్రకటించారు.

మిగిలిన వాళ్ళ నోళ్ళు మూయించటం యాజ్ఞవల్క్యుడికి నల్లేరు మీద బండి నడక అయింది.

"చాబాష్!" అనుకున్నాడు జనకుడు (దేవభాషలో) యాజ్ఞవల్క్యుణ్ణి చూసి.

వెయ్యి గోవులూ, అన్ని వేల తులాల బంగారమూ సంపాదించాక యాజ్ఞవల్క్యుడి చుట్టూ ఆకలిగొన్న బ్రాహ్మలు చాలామంది చేరి, అతన్ని ఆశ్రయించారు. యాజ్ఞవల్క్యుడి స్థాయి పెరిగింది. ఆవులను కోసి అతను అందరికీ వడ్డించాడు.

త్వరలోనే యాజ్ఞవల్క్యుడు జనకమహారాజు దర్బారులో ప్రత్యక్షమయ్యాడు. జనకుడు కుండ పగలేసి, "ఇంకా గోవులు కావలసి వచ్చావా? లేక నా నుంచి సూక్ష్మజ్ఞానం పొందటానికి వచ్చావా?" అని అడిగాడు.

యాజ్ఞవల్క్యుడు మర్యాదకూ, స్వార్థానికీ కూడా భంగం కలగకుండా, "రెండూకావాలి" అన్నాడు.

కాని త్వరలోనే యాజ్ఞవల్క్యుడు జనకుడితో, "నీకు పాతిక భాగమే తెలుసు. ముప్పాతిక తెలీదు" అన్నాడు.

"అయితే అది నువు చెప్పు" అన్నాడు జనకుడు.

యాజ్ఞవల్క్యుడు జనకుడికి చచ్చినా అర్థంగాని విషయాలు కొన్ని చెప్పాడు. (అర్థం కాకపోవటమే బ్రహ్మజ్ఞానానికి గీటురాయి గదా?)

జనకుడు, "చాబాష్!" అని మరో వెయ్యి బలిసిన ఎద్దులను ఇచ్చాడు. తరవాత ఆయన యాజ్ఞవల్క్యుడి శిష్యుడై ఉపదేశం పొందాడు.

యాజ్ఞవల్క్యుణ్ణి ఆశ్రయించిన అన్నార్తులైన బ్రాహ్మణుల సంఖ్య అపారంగా పెరిగిపోయింది. ఎద్దులు అయిపోతున్నాయి.

మళ్ళీ యాజ్ఞవల్క్యుడు జనక మహారాజువద్దకు వెళ్ళాడు – ఈసారి జనకుడికి జ్ఞానోపదేశం చెయ్యటానికి కాదు, అచ్చగా గోవులకోసమే అయి ఉండాలి.

కాని యాజ్ఞవల్క్యుణ్ణి చూడగానే జనకుడికి ప్రశ్నలు అడగబుద్ధి అయింది. సమాధానాలు – ఏదో నాన్సెన్స్ – చెప్పక యాజ్ఞవల్క్యుడికి తప్పలేదు. చాలాసేపు ఆత్మను గురించీ, కలలను గురించీ మాట్లాడుకున్నమీదట జనకుడు, "నా రాజ్యమే నీకిచ్చేశాను" అన్నాడు యాజ్ఞవల్క్యుడితో.

ఆ విధంగా యాజ్ఞవల్క్యుడు స్మృతికర్త కావటానికీ, నియమాలను గురించి స్వతంత్రంగా మాట్లాడటానికీ అర్హత సంపాదించుకున్నాడు.

జనకుడి రాజ్యమంటే గోవులే అనుకోవాలి. జనకుడు రాజుగా ఉండగానే, రాముడు సీతను వదిలేశాక గోమాంసం తినటం మానేసినట్టు భవభూతి చెబుతున్నాడు గనక, తన రాజ్యాన్ని యాజ్ఞవల్క్యుడికి ఇచ్చేసినప్పటికీ ఆయనకు గోవులతో పనేలేదు!

*(ఈ కథకు కొ.కు. 'చేతివాటు బృహదారాణ్యకోపనిషత్తు' అని నోట్ చేర్చారు. బహుశా గిరీశం బృహన్నారదీయం నాలుగో ఆశ్వాసం అనే కోతకు వ్యంగ్య ప్రస్తావన కావచ్చు)*

***ముద్రణ: యువ మాసపత్రిక, దీపావళి సంచిక, నవంబర్ 1977***